ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు సర్కారు బడుల్లో చేరిక

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ప్రభుత్వ ఉద్యోగులు తమ పిల్లలను కొయ్యలగూడెం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చేర్పించడం ద్వారా సమాజానికి ఒక శక్తివంతమైన సందేశాన్ని అందించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న వసంత విజయ తమ కుమార్తె శర్వాణిని, ప్రభుత్వ బాలుర హై స్కూల్ ఉపాధ్యాయులు ఎస్తయ్య తమ కుమార్తె నిహారికను, గజ్జల సరస్వతి తమ కుమార్తె సౌజన్యను పాఠశాలలో చేర్పించారు. విద్యా నాణ్యత, సమాన అవకాశాల పట్ల వారు చూపిన విశ్వాసం ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు, తల్లిదండ్రులకు ఆదర్శంగా నిలుస్తోందని పలువురు అంటున్నారు. ఈ చర్య ప్రభుత్వ విద్యావ్యవస్థపై వారి అచంచల నమ్మకాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. ఈ స్ఫూర్తిదాయక నిర్ణయం ప్రభుత్వ పాఠశాలల పట్ల సానుకూల దృక్పథాన్ని పెంపొందించడమే కాకుండా విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ఒక ముందడుగు అని పాఠశాల హెచ్ఎం ఉమాదేవి అన్నారు.

వేధిస్తున్న వైద్యుల కొరత..!

- ప్రభుత్వానికి పట్టని ఏలూరు సర్వజన ఆసుపత్రి సమస్యలు
- ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చర్చిస్తున్నా సమస్యలకు పరిష్కారం నిల్
- ప్రసూతి విభాగంలో ఎనిమిది మందికి ఆరుగురే డాక్టర్లు
- గర్భిణుల స్కానింగ్‌కు రేడియాలజిస్టును నియమించలేని దుస్థితి
- వివిధ విభాగాల్లో 97 మంది డాక్టర్లకు సగం కూడా లేని దుర్గర స్థితి
- ప్రజా వైద్యంపై కూటమి సర్కార్ తీవ్ర నిర్లక్ష్యం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి సర్కార్ అధికారంలోకొచ్చి ఏడాది దాటినా ఇప్పటికీ ఏలూరు సర్వజన ఆసుపత్రిలో సమస్యలపై దృష్టి సారించడం లేదు. రోగులకు వైద్య సేవలందించే వైద్యుల కొరత తీవ్రంగా ఉన్నప్పటికీ వైద్య ఆరోగ్యశాఖకు పట్టడం లేదు. కలెక్టర్ ఛైర్మన్‌గా ఉన్న ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో సమస్యలు చర్చిస్తున్నా పరిష్కారం కాని దుస్థితి నెలకొంది. దీంతో పని ఒత్తిడి తట్టుకోలేక డాక్టర్లు, సరిపడా వైద్యులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏలూరు సర్వజన ఆసుపత్రిలోని ప్రసూతి సేవల విభాగానికి ప్రత్యేక స్థానం ఉంది. జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పటి నుంచి ఇప్పటి వరకూ గర్భిణులకు సేవలందించడంలో అక్కడ పని చేస్తున్న వైద్యుల కృషి ఎనలేనిది. ప్రతిరోజూ సరాసరిన 150 మంది వరకూ గర్భిణులు ఓపి సేవలు పొందేందుకు వస్తుంటారు. ప్రతిరోజూ 15కు పైగా ప్రసవాలు జరుగుతుంటాయి. అందులో కొన్ని ఆపరేషన్ కేసులు, మరికొన్ని నార్మల్ డెలివరీలు ఉంటాయి. ఇంతమంది గర్భిణులకు సేవలందించేచోట పూర్తిస్థాయిలో డాక్టర్లను నియమించకపోవడం అత్యంత దారుణంగా చెప్పొచ్చు. ఎనిమిది మంది డాక్టర్లు ఉండాల్సిన ప్రసూతి విభాగంలో ఆరుగురు వైద్యులు మాత్రమే ఉన్నారు. నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నారు. దీంతో వైద్యులపై తీవ్రమైన

ఏలూరు సర్వజన ఆసుపత్రి

ఒత్తిడి నెలకొంటుంది. ప్రసూతి విభాగంలో గర్భిణులకు స్కానింగ్ చేసేందుకు రేడియాలజిస్ట్ సైతం లేకుండా పోయారు. ఒక్క రేడియాలజిస్ట్‌ను నియమించలేని స్థితిలో వైద్యఆరోగ్య శాఖాధికారులు ఉండటం అత్యంత దారుణంగా చెప్పొచ్చు. రేడియాలజిస్ట్ లేక ప్రయివేటు స్కానింగ్ సెంటర్లకు పంపించాల్సిన పరిస్థితి దాపురించింది. పేదలకు సేవలందించే ప్రభుత్వ బోధనాసుపత్రిలోనే ఈ పరిస్థితి ఉండటం చూస్తే ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్ల ఏవిధంగా ఆలోచిస్తుందో అర్థం చేసుకోవచ్చు. మెడికల్ కాలేజీ విద్యార్థులకు ప్రత్యేక హాస్టల్ నిర్మించకపోవడంతో ప్రసూతి విభాగం భవనంలోనే పైఅంతస్తులో ఏర్పాటు చేశారు. దీంతో ప్రసూతి విభాగంలో బెడ్స్ పెంచుకోవాలన్నా సాధ్యం కాని పరిస్థితి ఏర్పడింది. ప్రధానమైన వైద్యుల కొరత పరిష్కారమైతేనే ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతుంది.

అన్ని విభాగాల్లోనూ డాక్టర్ల కొరతే

సర్వజన ఆసుపత్రిలో ఇతర విభాగాల్లో పని చేసేందుకు మొత్తం 97 మంది డాక్టర్లు వరకూ అవసరం. ప్రస్తుతం అందులో సగం మంది డాక్టర్లు కూడా లేరు. ప్రతిరోజు వెయ్యికిపైగా ఓపి ఉంటుంది. 300కుపైగా బెడ్స్ ఉన్నాయి. ఈ విధంగా డాక్టర్ల కొరత ఉంటే పేదలకు వైద్యం ఏవిధంగా అందుతుందో ప్రభుత్వమే చెప్పాలి. ముఖ్యమైన గుండె, కిడ్నీ వంటి వ్యాధులను చూసే వైద్యులు ఒక్కరూ కూడా లేకుండాపోయారు. దీంతో సర్వజన ఆసుపత్రి కాస్తా రిఫరల్ ఆసుపత్రిగా మారిపోతుంది. జిల్లాలోని ప్రజాప్రతినిధులంతా కలిసికట్టుగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే తప్ప ఏలూరు సర్వజన ఆసుపత్రిలో డాక్టర్ల కొరత, ఇతర సమస్యలు తీరే పరిస్థితి కనిపించడం లేదు. ఎంతసేపు పెట్టుబడులు, కార్పొరేట్ గురించి మాట్లాడటం తప్పితే.. పేదల వైద్యం గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఏలూరు సర్వజన ఆసుపత్రిలో సమస్యలను గుర్తించి, పరిష్కరించి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

క్రమేపీ పెరుగుతున్న గోదావరి వరద

పోలవరం స్పిల్‌వే నుండి 1,35,341 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి - పోలవరం

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి వరద క్రమేపీ పెరుగుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుండి అదనంగా వస్తున్న 1,35,341 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేసినట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 27.450 మీటర్లు, దిగువన 18.100 మీటర్లు, ఎగువ కాపర్ డ్యామ్ ఎగువన 27.500 మీటర్లు, దిగువ కాపర్ డ్యామ్ దిగువన 16,700 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యామ్‌ల మధ్య 16.080 మీటర్లు నీటిమట్టం నమోదైంది. ప్రాజెక్టు దిగువన గోదావరి నీటిమట్టం 5.660 మీటర్లుగా నమోదైందని, ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి క్రమ క్రమంగా పెరుగుతుందని సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు.

వేలేరుపాడు రూరల్: రుద్రమకోట పడవ రేవు వద్ద గోదావరి

వేలేరుపాడు రూరల్: గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతుండటంతో జనం ఆందోళన చెందుతున్నారు. వరద ఉధృతి ఇలానే కొనసాగితే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాల్సి వస్తుందని మండలంలోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాకు పరిహారం ఇప్పించండి

తాట్కూర్‌గొమ్ము కాలనీవాసుల ధర్నా

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

తమకు న్యాయం చేయాలని కోరుతూ తాట్కూర్ గొమ్ము కాలనీవాసులైన పోలవరం నిర్వాసితులు గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తమ గ్రామాన్ని కూడా మొదటి జాబితాలో తీసుకుని న్యాయం చేయాలని ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిపిఎం నాయకులు మద్దతు తెలిపారు. తమ కాలనీని 41.15 కాంటూర్ పరిధిలో మొదటి జాబితాలో తీసుకుని తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కలవగా, మీ గ్రామం 41.15 మొదటి జాబితా పరిధిలోనే ఉందని తెలిపారన్నారు. దీనిపై స్థానిక తహశీల్దార్‌ను కలవగా ఈ విషయం తన పరిధిలో లేదని, ఇరిగేషన్ అధికారులు చూడాలని సమాధానమిచ్చారని చెబుతున్నారన్నారు. మళ్లీ వర్షాకాలం రావడంతో ఎలాంటి పరిస్థితులు ఎదుర్కోవాలోనని ఆందోళనగా ఉందన్నారు. తమకు వెంటనే పరిహారం ఇప్పించి, వరదలు రాకముందే పునరావాస కాలనీలకు తరలించి న్యాయం చేయాలని నిర్వాసితులు కోరారు. అనంతరం తహశీల్దార్ డివి.సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు.


తహశీల్దార్‌కు వినతి అందిస్తున్న నిర్వాసితులు

ప్రమాదపు అంచున సాగునీటి టన్నెల్

భారీ వాహనాలతో ముప్పు

850 ఎకరాల ఆయకట్టు రైతుల ఆందోళన

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం వంతెన మూసివేతతో సుమారు 850 ఎకరాల ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారనుందా అనే భయాందోళన రైతులను వెంటాడుతోంది. ఏలూరు కాలువపై వంతెన శిథిలావస్థకు చేరడంతో జూన్ 15న మూసేశారు. దీంతో భారీ వాహనాలన్నీ కాలువ గట్టు రోడ్డు నుంచి చేబ్రోలు పోలీసు స్టేషన్ మీదుగా జాతీయ రహదారిని చేరుకుంటున్నాయి. ఏలూరు ప్రధాన కాలువ నుంచి నారాయణపురంలో సుమారు 850 ఎకరాల ఆయకట్టులో వరి సాగులో ఉంది. ఆ పొలాలకు సాగు నీరు కాలువ గట్టు రోడ్డు దిగువ (అండర్ టన్నెల్ - యూటీ) నుంచి మూడు బోదెల ద్వారా సరఫరా అవుతోంది. కాలువ నిర్మాణ సమయంలోనే బ్రిటీష్ వారు నిర్మించిన ఈ స్ట్రక్చర్ సుమారు 15 ఏళ్ల క్రితమే పాడైంది. ఈ నేపథ్యంలో నీటిసంఘాల ఆధ్వర్యంలో కొత్తగా అండర్ టన్నెల్ నిర్మించి మూడు తూములను ఏర్పాటు చేశారు. వాటి ద్వారా ఏడాదికి రెండు పంటలకు సాగునీరందిస్తున్నారు. అయితే భారీ వాహనాలు తిరగడం వల్ల ఈ అండర్ టన్నెల్ వద్ద తరచూ దిగబడి పోతున్నా యి. ఇదే రీతిని బరువైన వాహనాలు తిరిగితే యూటీ ఏమాత్రం దెబ్బతిన్నా సాగునీటికి గడ్డు కాలం దాపురించే ప్రమాదం ఉందని రైతుల్లో చర్చ నడుస్తోంది. దీనిమీదుగా భారీ వాహనాలు రాకుండా పంచాయతీ చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. యూటీ పాడైతే రైతులు చాలా ఇబ్బందులు పడిపోతారని, తక్షణం ఇరిగేషన్, పంచాయతీ, పోలీసు, రెవెన్యూ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని రైతు పాతూరి వీర వెంకట సత్యనారాయణ కోరారు.

సాగునీటి అండర్ టన్నెల్

బాధితులకు సత్వర న్యాయానికి కృషి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పార్టీలకు అతీతంగా ప్రతిఒక్కరికీ అండగా నిలుస్తూ బాధితులకు సత్వరమే న్యాయ పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ అన్నారు. ఆమె గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలోని వన్‌స్టాప్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ప్రతి జిల్లాలో ఏర్పాటు చేసిన ప్రిమారిటల్ కమ్యూనికేషన్ సెంటర్ ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. తదుపరి టిటిడి కళ్యాణమండపం వద్ద ఉన్న వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌ను సందర్శించారు. బాధిత మహిళల సహాయంకోసం ఏర్పాటు చేసిన వన్‌స్టాప్ సెంటర్‌లో మెరుగైన సేవలు అందించాలని సంబంధిత అధికారులకు ఆమె దిశానిర్దేశం చేశారు. నమోదవుతున్న కేసుల రిజిస్టరు, వైద్య సదుపాయం తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ ఆడపిల్లలకు అన్యాయం జరగకూడదనేదే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న వివిధ రకాల దాడులను, అఘాయిత్యాలను నిరోధించేందుకు కమిషన్ కృషి చేస్తుందన్నారు. గృహింస, వేధింపులు, మహిళల అక్రమ రవాణా, వరకట్న వేధింపులు, సైబర్ నేరాలు, కిడ్నాప్, బాల్యవివాహాలు తదితర అంశాలపై క్షేత్ర స్థాయిలో పెద్దఎత్తున అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో మహిళా శిశుసంక్షేమ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.సుజాత, నోడల్ అధికారి స్వరాజ్యలక్ష్మి, సిడిపిఒ రాజశేఖర్, ఇఒ మల్లిక, సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ నిర్మల, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ ఎం.సుబ్బారావు, తహశీల్దారు గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో...

ముసునూరులో...

వన్‌స్టాప్ సెంటర్‌లో మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ

ముసునూరు గురుకుల పాఠశాల సందర్శన

ముసునూరు: ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ గురుకుల బాలికల పాఠశాలల్లో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించడం అభినందనీయమని మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. గురువారం ముసునూరు గురుకుల బాలికల పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కె.లక్ష్మికుమారిని పాఠశాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో పలు అంశాలపై ముచ్చటించారు. వంటశాల, భోజనశాలను పరిశీలించారు. భోజనశాల విద్యార్థులకు సరిపోవడం లేదని, పైగా వర్షం కురుస్తుందని విద్యార్థులు తెలిపారు. మద్యం దుకాణం కూత వేటు దూరంలో ఉందని వాపోయారు. దీనిపై ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ మంచి లక్ష్యంతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణరాజ్, సిడిపిఒ పి.విజయకుమారి, తహశీల్దార్ కె.వెంకటరమణ, స్కూల్ కమిటీ ఛైర్మన్ ఎస్.పంగిడియ్య, కమిటీ సభ్యులు గోగం కాసులు, కిషోర్ పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలందరిని బడిలో చేర్చాలి

- క్షేత్రస్థాయిలో పర్యటిస్తేనే లక్ష్య సాధన సాధ్యం
- రెండు రోజులపాటు పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించాలి
- స్టూడెంట్ ఎన్‌రోల్‌మెంట్ నూరుశాతం పూర్తికి కృషి
- కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో 6 నుండి 14 ఏళ్లలోపు పిల్లలందరూ విధిగా పాఠశాలలకు వెళ్లేటట్లు చూడాల్సిన బాధ్యత తల్లితండ్రులతోపాటు ఉపాధ్యాయులు, అధికారులపైనా ఉందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పష్టం చేశారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో 'నేను బడికి పోతా' కార్యక్రమం అమలుపై జిల్లాస్థాయి అవగాహన, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రాపవుట్లను పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమంలో భాగంగా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రచురించిన 'నేను బడికి పోతా' పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో స్టూడెంట్ ఎన్‌రోల్‌మెంట్ నూరు శాతం పూర్తి చేయడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. బడిఈడు పిల్లలు, బడి మానివేసిన పిల్లలను తిరిగి బడిలో చేర్పించేందుకు గ్రామ, మండల, డివిజన్ స్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తారన్నారు. సంబంధిత కమిటీలోని వివిధ శాఖల అధికారులు తమ శాఖ సిబ్బందితో సమన్వయం చేసుకుని రానున్న 15 రోజులపాటు నిర్వహించే 'నేను బడికి పోతా' కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలన్నారు. తక్షణమే రెండు రోజులపాటు అన్ని పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఏ ప్రాంతంలో ఎక్కువమంది పిల్లలు హాజరు కావడం లేదో గుర్తించి, ఆ ప్రాంతంలో పర్యటించి ఎన్‌రోల్ అయ్యేందుకు కృషి చేయాలన్నారు. డ్రాపవుట్లలో మొదటి 10 మండలాలను గుర్తించి అక్కడ వాటిని ఆయా జిల్లా అధికారులు దత్తత తీసుకొని డ్రాపవుట్ల నివారణా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడే లక్ష్యాలు సాధించగలమని కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. విద్య, వైద్యం, ఐసిడిఎస్, కార్మిక, రెవెన్యూ, సంక్షేమ శాఖలు సమన్వయంతో జిల్లాను డ్రాపవుట్స్‌రహిత జిల్లాగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ, సమగ్రశిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ పంకజ్ కుమార్, సిపిఒ వాసుదేవరావు, డిఎంహెచ్ఒ ఆర్.మాలిని, సోషల్ వెల్ఫేర్ జెడి వై.విశ్వమోహన్‌రెడ్డి, ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాసరావు, డిపిఒ కె.అనురాధ, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి ఎస్ఎస్.కృపావరం, విద్య, ఐటిడిఎ, పోలీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

గంజాయి అక్రమ రవాణా నిర్మూలనకు కృషి

ఈగల్ టీమ్ డిఐజి రవికృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

గంజాయి అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో నిర్మూలించేలా ఈగల్ టీమ్ పని చేస్తుందని ఆ టీమ్ డిఐజి రవికృష్ణ తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస కూలీల పేరుతో రాష్ట్రానికి వస్తున్న కొందరు కొద్దికొద్ది మొత్తంలో గంజాయి రవాణాకు పాల్పడుతున్నారన్న సమాచారంతో రైళ్లల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ఆపరేషన్ విజయ పేరు పెట్టామని ఆయన తెలిపారు. నగరంలోని పెద్ద రైల్వే స్టేషన్‌లో ఈగల్ టీమ్ డిఐజి రవికృష్ణ, ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్, ఈగల్ టీమ్ ఎస్‌పి నాగేశ్వరరావు, జిల్లా అదనపు ఎస్‌పి నక్క సూర్యచంద్రరావు, ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి పోలీసులు గురువారం సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఈగల్ టీమ్ డిఐజి రవికృష్ణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈగల్ టీమ్ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు 21,736 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతమైన అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించామని, డ్రోన్ సహాయంతో సాగు చేస్తున్న పంటను గుర్తించి వాటిని నాశనం చేస్తున్నామని తెలిపారు. డ్రోన్ల సహాయంతో పోలీసింగ్ నిర్వహించడంతో ఈ సాగు చేసేవారిలో పూర్తిస్థాయి భయం ఏర్పడిందని తెలిపారు. ఈగల్ టీమ్ 370 గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచిందన్నారు. అక్కడ ఉన్న వారికి ప్రత్యామ్నాయ పంటలు పెంచుకునేందుకు విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ఈగల్ టీమ్ ముఖ్య ఉద్దేశమన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి పంటను పూర్తిగా ధ్వంసం చేసినప్పటికీ రాష్ట్రంలోకి ఒడిశా నుంచి చిన్నచిన్న మొత్తాలలో గంజాయిని సరఫరా చేస్తున్నట్లు తాము గుర్తించామని, వీటిని నిర్మూలించేందుకే రైళ్లల్లో ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు. గంజాయి అక్రమ రవాణా వాటి నిర్మూలనకు ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్ 1972 ఏర్పాటు చేసిందన్నారు. గంజాయి అక్రమ రవాణా దారుల ఆస్తులను సైతం ఈగల్ టీమ్ జప్తు చేస్తుందని చెప్పారు. ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ మాట్లాడుతూ ఏలూరును మాదకద్రవ్యాల రహిత జిల్లాగా చేసేందుకు తాము పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 20 కేసులు నమోదు చేశామని, వాటిలో 700 కేజీల గంజాయిని, 11 బైక్‌లను స్వాధీనం చేసుకుని, 45 మందిని అరెస్టు చేశామని తెలిపారు. గంజాయికి ఎవరైనా బానిస అయితే డి అడిక్షన్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయని, వారికి కౌన్సెలింగ్ ఇప్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెండో పట్టణ సిఐ అశోక్ కుమార్, మూడో పట్టణ సిఐ కోటేశ్వరరావు, ఎక్సైజ్ సిఐ ధనరాజు, జిఆర్‌పిడి ఎస్‌పి రత్నరాజు, రైల్వే లైన్ ఇన్‌స్పెక్టర్ ఎంబి.దుర్గారావు, ఏలూరు ఆర్‌పిఎఫ్ ఎస్ఐ సైమన్, ఆర్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ బెన్నీ, ఆర్‌పిఎఫ్ ఎస్ఐ ధనుష్, ఎఎస్ఐ వివి.రత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఈగల్ టీమ్ డిఐజి రవికృష్ణ

ఏజెన్సీలో టీచర్ల పోస్టులను భర్తీ చేయాలి

- స్థానిక నిరుద్యోగులతో విద్యా వాలంటీర్లను నియమించాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

ఏజెన్సీ మండలంలోని సర్కారు బడులు సమస్యలకు నిలయాలుగా మారాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కొలికపోగు లెనిన్ విమర్శించారు. గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా కుక్కునూరు మండలంలో సర్కారు బడుల్లో టీచర్ల కొరత తీవ్రంగా వేధిస్తుందని చెప్పారు. ఈ ఏడాది పాఠశాలల ప్రారంభంలోనే మండలంలోని పలు పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లు బదిలీపై వెళ్లినా ఖాళీగా ఉన్న పోస్టులను తిరిగి భర్తీ చేయడంలో విద్యాశాఖ ఎందుకు అలసత్వం వహిస్తుందని ప్రశ్నించారు. టీచర్ల లేకపోవడంతో పిల్లల చదువులు అగమ్యగోచరంగా మారాయని వ్యక్తం చేశారు. కుక్కునూరు మండలంలో ఉన్న 41 ప్రభుత్వ పాఠశాలల్లో 114 మంది టీచర్ల పోస్టులు ఉండగా రెగ్యులర్ టీచర్లు 20 మంది, డిప్యూటేషన్‌పై మరో 18 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మండల వ్యాప్తంగా పలు పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 77 మంది టీచర్ల పోస్టుల భర్తీని అధికారులు తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. మండలంలోని రాయిగూడెం, ఉప్పేరు, చీరవల్లి, రామసింగారం సెంటర్లలో ఉన్న నాలుగు మోడల్ పాఠశాలల్లో 26 మంది టీచర్లకు కేవలం ఎనిమిది మంది టీచర్లతోనే పిల్లల చదువులు సాగుతున్నాయని తెలిపారు. కొన్నిచోట్ల ఒక్క టీచర్‌తోనే పాఠశాల కొనసాగడం దయనీయమన్నారు. అంతేకాకుండా పాఠశాలల్లో వసతులు లేక పిల్లలు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరత ఉండటంతో తమ పిల్లలను ప్రయివేట్ పాఠశాలలకు పంపడానికి మొగ్గు చూపుతున్నారన్నారు. విద్యాశాఖ తక్షణమే ఖాళీగా ఉన్న టీచర్ల పోస్టులను భర్తీ చేయాలని, ఆలస్యమయ్యేలా ఉంటే అప్పటివరకు స్థానిక అర్హత ఉన్న స్థానిక నిరుద్యోగులతో విద్యా వాలంటీర్లను నియమించి పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సమావేశంలలో వి.లక్ష్మణ్, ఎం.శివ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న లెనిన్

11 మంది విద్యార్థులకు అస్వస్థత

ఆసుపత్రికి తరలింపు - మలేరియా జ్వరాలుగా నిర్ధారణ

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని చేగొండ పల్లి ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 11 మంది విద్యార్థులు గురువారం అస్వస్థతకు గురయ్యారు. ఉదయం ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు గురి కాగా హాస్టల్ వార్డెన్ కుంజం శంకరుడు వారిని పోలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యాధికారి గుణశేఖర్ రక్త పరీక్షలు నిర్వహించి మలేరియా జ్వరాలుగా నిర్ధారించి వైద్య సేవలందించారు. మధ్యాహ్నం అస్వస్థతకు గురైన హాస్టల్లో ఉన్న మరో ఎనిమిది మంది విద్యార్థులను పోలవరం సిహెచ్‌సికి తరలించి వైద్య సేవలందించారు. విద్యార్థులు అస్వస్థతకు గురి కావడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారు. అధికారులు మలేరియా నివారణ కోసం మలాథియాన్ స్ప్రేయింగ్ పనులు రెండు విడతలు హాస్టల్లో చేయించారని హాస్టల్ వార్డెన్ తెలిపారు. హాస్టల్ పరిసరాల్లో పరిశుభ్రత విషయంలో అధికారులు చర్యలు తీసుకోవాలని, మిగిలిన విద్యార్థులకు రక్త నమూనాలు సేకరించి వైద్య సేవలందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


చికిత్స పొందుతున్న విద్యార్థులు

రీ సర్వే చేస్తామనడం సరికాదు

తరుగుమూల ఇళ్ల స్థలాల లబ్ధిదారులు

ప్రజాశక్తి - మండవల్లి

రీ సర్వే చేసి పట్టాలను పంపిణీ చేస్తామననడం తమను అవమానించడమేనని లబ్ధిదారులు పద్మ సింహాచలం అన్నారు. పట్టాలు అప్పగించి స్థలాలు మెరక చేసి ఇళ్లు నిర్మించుకునేలా చేయాలని కోరుతూ తరుగుమూల ఇళ్లస్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం కొనసాగాయి. 11వ రోజు పెద్ద ఎత్తున తదితరులు రిలే నిరాహార దీక్షలో పాల్గొని దీక్ష చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టాలను పంపిణీ చేసి ఆదుకోకుండా మళ్లీ రీ సర్వే చేస్తామని లబ్ధిదారుల కుటుంబాలను మరింత వేదనకు గురి చేయడం సరైన పద్ధతి కాదన్నారు. మెరక చేసి పట్టాలను పంపిణీ చేయకపోవడంతో అటు ఇల్లు నిర్మించుకోలేక, ఇటు అద్దె ఇళ్లకు అద్దెలు కట్టలేక నరకయాతన అనుభవిస్తున్నామన్నారు. ఇప్పటికైనా లబ్ధిదారుల ఆవేదనను అర్థం చేసుకుని వెంటనే పట్టాలను పంపిణీ చేసి స్థలాలను మెరక చేసి ఇల్లు నిర్మించుకునేలా చేయాలని కోరారు. లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేపట్టి అధికారులపై ఒత్తిడి తీసుకొస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగమణి, మంగమ్మ, వెంకటేశ్వరమ్మ, వీరమ్మ, కనకదుర్గ, వెంకటేశ్వరమ్మ, సువర్ణ, కమల, కుమారి, జస్వంత, దేవమాత, సుజాత, మరియమ్మ, రుతమ్మ, మరియమ్మ, అనిత, మేరీ, సుధాకరరావు, ప్రభుదాసు, మాణిక్యం, వెంకటరమణ, రమణ, తదితర లబ్ధిదారులు పాల్గొన్నారు.

దీక్షలో ఇళ్లస్థలాల లబ్ధిదారులు

డిపాజిట్లు చెల్లించాలని సొసైటీకి తాళాలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

డిపాజిట్లు చెల్లించాలని కోరుతూ టి.నరసాపురం సొసైటీలో డిపాజిట్ దారులు గురువారం సొసైటీకి తాళాలు వేసి ఆందోళన నిర్వహించారు. కాల పరిమితి పూర్తయిన డిపాజిట్ల నగదు చెల్లించాలని డిపాజిట్ దారులు సిబ్బందిని బయటకు పంపి గేట్లు మూసివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీలో 370 మంది డిపాజిట్‌దారులు రూ.34 కోట్లు డిపాజిట్ చేయగా కాల పరిమితి పూర్తైన వారికి రూ.17 కోట్ల వరకు చెల్లించారని, మిగిలిన వారికి మూడేళ్లు గడిచినా చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిపాజిట్లు చెల్లించకపోతే రెన్యూవల్ చేయాలని, రూతుల రుణాలకు జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇటీవల ఎస్‌బి ఖాతాల నుంచి నగదు రైతు రుణాలకు జమ చేసిన అధికారులు తమ డిపాజిట్ల విషయంలో పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కార్యదర్శి ఆగస్టీన్‌ను వివరణ కోరగా రైతులు రుణాలు చెల్లిస్తేనే డిపాజిట్లు ఇవ్వాలని ఉన్నతాధికారులు సూచించినట్లు ఆయన తెలిపారు. రైతులు తీసుకున్న రుణాలు చెల్లించిన వాటిని డిపాజిట్ దారులకు అందిస్తామని తెలిపారు.

ఆర్‌జియుకెటిలో ప్రవేశాలకు అడ్మిషన్లు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లకు 2025-26 సంవత్సరానికి అడ్మిషన్లు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా నూజివీడు ఎస్ఎసి ఆడిటోరియంలో ఈ నెల మూడో తేదీతో రెండు రోజుల శ్రీకాకుళం క్యాంపస్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 547 మందికి కాల్ లెటర్స్ పంపించారు. విద్యార్థులకు ఏ విధమైన ఇబ్బంది కలగకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. రెండురోజుల కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరగడం పట్ల శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ కెవిజిడి.బాలాజీ సంతృప్తి వ్యక్తం చేశారు. మొత్తం అడ్మిషన్ల ప్రక్రియను ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, ప్రవేశాల కన్వీనర్ సంద్ర అమరేంద్ర కుమార్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ డీన్ శ్రావణి, సెంట్రల్ ఎఒ బండి ప్రసాద్, ఇవాల్యుయేషన్ డీన్ రియాజ్ హుస్సేన్, ఫైనాన్స్ ఆఫీసర్ శ్రీనాథ్, అకాడమిక్ రిజిస్ట్రార్ అర్జునరావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. వాలంటీర్లు తగిన సహకారం అందించారు. మూడో తేదీతో శ్రీకాకుళం క్యాంపస్‌లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ముగిసింది. 4, 5 తేదీల్లో నూజివీడులోని ఎస్ఎసి ఆడిటోరియంలో ఒంగోలు క్యాంపస్ ప్రవేశాలకు ఉఅడ్మిషన్ ప్రక్రియ మొదలవుతుంది.

9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - నిడమర్రు

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ నెల 9వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు కోరారు. మండలంలోని నిడమర్రు, భువనపల్లి, అడవికొలను గ్రామాల్లో ఆక్వా ఐస్ ఫ్యాక్టరీ పరిశ్రమలో హమాలీ జట్టు కార్మికులకు, ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాల్లో, ప్రయివేట్ ఉద్యోగులకు బ్యాంకులుకు గురువారం సమ్మె నోటీసులు అందించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ సమ్మె రోజు ఐస్ ఫ్యాక్టరీల్లో, ఆక్వా రంగాల్లో లారీలు నిలుపుదల చేస్తూ రవాణా ఎగుమతి, దిగుమతులు ఆపివేయాలన్నారు. కార్మికులు స్వేచ్ఛగా సమ్మెలో పాల్గొనేలా పరిశ్రమ యజమానులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోన శ్రీనివాసరావు, కమిలి నాని, కానూరు రాజు, సంకు నాగ శ్రీను, పెదకాపు మురళి, తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి :ఈ నెల 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం నిర్వహించిన సిఐటియు మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్త సమ్మెలో కార్మిక వర్గం పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సమ్మె బుక్‌లెట్ ఆవిష్కరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహంకాళీరావు, రైతు సంఘం నాయకులు వి.భాస్కరరావు, సిఐటియు మండలాధ్యక్ష, కార్యదర్శులు జక్కుల మహేష్, షేక్ అభిదాబేగం, సిఐటియు నాయకులు జె.మేనకలక్ష్మి, కె.రమాదేవి, బి.పుష్ప, పి.బాలాజీ, అబ్దుల్ అక్బర్, బి.రామనాగేంద్రం, రామకృష్ణ, సూరిబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు బహూకరణ

ప్రజాశక్తి - ముసునూరు

గురుకుల బాలికల పాఠశాల పూర్వ విద్యార్థిని చలసాని శాంతి ప్రస్తుతం పునాదిపాడులో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. ఆమె తల్లిదండ్రుల చలసాని శ్రీరాములు, ప్రభావతి (రిటైర్డ్ టీచర్లు) పేరు మీదగా మీ గమ్యం మీ చేతుల్లోనే అనే పుస్తకాలను ముసునూరు గురుకుల బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బహూకరించారు. ఇలాంటి ప్రోత్సాహకాలను మరిన్ని కల్పిస్తారని ఆశిస్తూ ప్రిన్సిపల్ కె.లక్ష్మీకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు కృతజ్ఞతలు తెలిపారు.

భాస్కరరావుకు పుత్ర వియోగం

ప్రజాశక్తి - మండవల్లి

ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి, అంబేద్కర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు లంకపల్లి భాస్కరరావుకు పుత్రవియోగం కలిగింది. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. నాలుగో సంతానమైన సురేష్ మహారాజ్ తీవ్ర అస్వస్థతకు లోనయ్యాడు. కుటుంబీకులు ఆయనను హైదరాబాద్‌కు తరలించి ఎఐజి హాస్పిటల్‌లో వైద్య సేవలందించి అనంతరం విజయవాడలోని విధాత హాస్పిటల్‌లో చేర్పించి వైద్య సేవలందించారు. గత 12 రోజులుగా వైద్య సేవలు పొందుతున్న సురేష్ మహారాజ్ గురువారం ఉదయం ఒక్కసారిగ తీవ్రమైన గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. సురేష్ మహారాజ్‌కు భార్య, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. బంధువుల సందర్శనార్థం సురేష్ మహారాజ్ మృతదేహాన్ని మండవల్లిలోని వారి నివాసం వద్ద ఉంచుతామని, అనంతరం అంత్యక్రియలు నిర్వహిస్తామని తండ్రి భాస్కరరావు ప్రజాసేవకు అంకితమైన భాస్కరరావుకు పుత్ర వినియోగం కలగడం చాలా బాధాకరమని మండవల్లి గ్రామం అంబేద్కర్ అసోసియేషన్ సభ్యులు అన్నారు.

శానిటేషన్ మెరుగుకు కృషి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని బయ్యన్నగూడెం, సీతంపేట పంచాయతీల్లో శానిటేషన్ కార్యక్రమాలపై జిల్లా పరిషత్ సిఇఒ ఎం.శ్రీహరి గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా చెత్త సేకరణ వ్యవస్థను ఆయన పరిశీలించారు. శానిటేషన్ వ్యవస్థను మరింత మెరుగుపరచడానికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి 'మానవత' సాయం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

బాధిత కుటుంబానికి మానవత స్వచ్ఛంత సేవా సంస్థ ఆర్థిక సాయం అందించింది. జంగారెడ్డిగూడెం నూకాలమ్మ ఆలయం ఎదురుగా ఉంటున్న దెయ్యాల నూకరాజు అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబానికి జంగారెడ్డిగూడెం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు అల్లూరి రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సాయం చేశారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నుంచి రూ.ఐదు వేలు, రామకృష్ణ రూ.రెండు వేలు, మానవత మూర్తి రూ.వెయ్యి, ఎంపీ గౌడ్ రూ.రెండు వేలు, ఆకుల ధర్మరాజు రూ.500 మొత్తం రూ.10,500 ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఛైర్మన్ ఆకుల ధర్మరాజు, మానవత మూర్తి, జిల్లా కన్వీనర్ త్రిపుర రమేష్, ట్రెజరర్ ఇమ్మంది మాధవరావు, ఉపాధ్యక్షులు గంధం గోపాలకృష్ణ, గద్దె సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రైలు నుంచి జారిపడి ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రైలు నుంచి జారిపడి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన వట్లూరు రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది రైల్వే ఎస్ఐ సైమన్ తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని ఫిలహౌస్‌పేటకు చెందిన నేతల చంద్రశేఖర్ ఆజాద్(51) ఏలూరు రూరల్ పరిధిలోని శ్రీపర్రు జిల్లా పరిషత్ పాఠశాలలో బయాలజీ టీచర్‌గా పని చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి విజయవాడలోని తన సోదరుని ఇంటికి వెళ్లేందుకు ఏలూరు నగరంలో కాకినాడ- తిరుపతి రైలును ఎక్కారు. రైలు వట్లూరు సమీపానికి చేరుకునేసరికి ప్రమాదవశాత్తు జారిపడి ఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఆజాద్ విజయవాడ చేరుకోలేదని విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. గురువారం మధ్యాహ్నం ఆజాద్ మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహాన్న పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆటో ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం విన్నకోట గ్రామానికి పేర్ని దుర్గారావు బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి చేపల పట్టుబడి నిమిత్తం బయలుదేరి వెళ్లాడు. రాత్రి 11 గంటల సమయంలో దుర్గారావు ముదినేపల్లిలోని పూర్ణిమ థియేటర్ వద్ద రోడ్డు దాటుతుండగా ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దుర్గారావు అక్కడికక్కడే మరణించాడు. మృతుని కుమారుడు పేర్ని నాగబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హెచ్‌సి పెద్దిరాజు తెలిపారు.

51 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

నూజివీడు టౌన్ :అక్రమంగా తరలిస్తున్న 51 క్వింటాల రేషన్ బియ్యాన్ని బుధవారం అర్ధరాత్రి నూజివీడు బైపాస్ రోడ్డులో ఏలూరు విజిలెన్స్ అధికారులు, నూజివీడు పిడిఎస్ డిటి జి.వెంకటేశ్వరరావు పట్టుకున్నారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకుని వాహన డ్రైవర్ నక్క శివ, రేషన్ బియ్యం సరఫరాదారులు ధనికొండ గోపీరాజు, ధనికొండ గణేష్, కాసిం బాబు, నక్క నాగ గోపాలకృష్ణ అనే వారిపై కేసు నమోదు చేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పుంతరోడ్డును విస్తరించాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఏలూరు- తూగో జిల్లాలను కలిపే గొల్లగూడెం - సింగరాజుపాలెం పుంత రోడ్డును ఎంపిడిఒ రాజ్ మనోజ్ గురువారం సందర్శించారు. నాలుగు కిలోమీటర్ల పొడవు ఉండే ఈ మట్టి రోడ్డును కంకర రోడ్డుగా నిర్మిస్తే రెండు జిల్లాల రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించేందుకు అణువుగా ఉంటుందని గొల్లగూడెం సర్పంచి శ్రీనివాస్, టిడిపి మండలాధ్యక్షుడు వేములపల్లి సుధీర్ సూచించారు. పంచాయతీ తీర్మానం ఇస్తే ఎస్టిమేషన్ తయారుచేసి నిధుల విడుదలకు కృషి చేస్తానని ఎంపిడిఒ హామీ ఇచ్చారు. విఆర్ఒ నాగరాజు పాల్గొన్నారు.

మెకానిక్‌ల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రపంచ మెకానిక్ దినోత్సవం సందర్భంగా మెకానిక్‌ల ఆత్మీయ సమావేశం ఏలూరులోని వసంత మహల్ వద్ద ఉన్న ఫైనాన్స్ బైక్ షోరూంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విజయలక్ష్మి వాసు, రమేష్ హాజరయ్యారు. ముందుగా కేక్ కటింగ్ నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథులను యూనియన్ ప్రెసిడెంట్ నాగరాజు, స్టేట్ సెక్రటరీ త్రినాధ్ ఘనంగా సన్మానించారు. ఇటీవల ప్రమాదంలో మరణించిన యమహా నాగరాజు కుటుంబానికి మెకానిక్ వర్కర్స్ అసోసియేషన్ వారి తరపున రూ.పది వేలు ఆర్థిక సాయం అందించారు. అనంతరం ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటిని కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ పితాని నాగరాజు, స్టేట్ సెక్రటరీ త్రినాధ్, సత్యనారాయణ, బుల్లెట్ శ్రీను, శాతవాహన శ్రీను , మెకానికులు పాల్గొన్నారు.

మెకానిక్‌ల ర్యాలీ

ముదినేపల్లి :మండల కేంద్రమైన ముదినేపల్లిలో గురువారం మెకానిక్‌ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముదినేపల్లిలోని అన్ని ప్రధాన రహదారుల్లో మెకానిక్‌లు బైక్ ర్యాలీ చేశారు. స్థానిక గురజ రోడ్డు సెంటర్‌లో ఎస్ఐ విఎస్.వీరభద్రరావు కేక్ కట్ చేశారు.

పగిలిన తూరలకు మరమ్మతులు

ఉంగుటూరు :నారాయణపురం పాతూరి కాంప్లెక్స్ రోడ్డులో పగిలిన తూర కల్వర్టుకు మరమ్మతులు చేశారు. కాలువపై వంతెన మూసేయడంతో వాహనాలన్నీ ఈ దారిలోనే ప్రయాణిస్తున్నాయి. సరిగ్గా రోడ్డుకు మధ్యలో తూర పగిలిపోయి పెద్ద గొయ్యి పడింది. ద్విచక్ర వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు సర్పంచి దిడ్ల అలకనంద గురువారం జెసిపితో పగిలిన తూర తొలగించి మరమ్మతులు చేసి యధావిధిగా రాకపోకలకు దారి ఏర్పాటు చేశారు.

రోడ్లు బాగు చేయాలని నిరసన

ప్రజాశక్తి - నిడమర్రు

నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

మండలంలోని పత్తేపురం, నిడమర్రు ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆర్అండ్‌బి రహదారులు వెంటనే బాగు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నారపల్లి రమణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పత్తేపురం-నిడమర్రు రహదారిలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి సంవత్సరం కాలం పూర్తవుతున్నా రహదారులు బాగు చేయలేదన్నారు. ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, వెంటనే రోడ్లు బాగుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, మోహను రాజు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకం నిర్వహించాలి

ఆగిరిపల్లి :మెనూ ప్రకారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వహించాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపిడిఒ బి.భార్గవి హెచ్చరించారు. మండల కేంద్రమైన ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకాన్ని ఆమె, ఎంఇఒ-2 కె.ఆనంద్‌కుమార్‌తో కలిసి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు బివిఎస్.లక్ష్మి, పి4 మార్గదర్శకులు బెల్లం సుబ్బారావు, వెంకటేశ్వరరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పని చేయాలి

ప్రజాశక్తి - ముసునూరు

ఆగిరిపల్లిలో..

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా గ్రామపంచాయతీ కార్యదర్శులు పని చేయాలని జిల్లా గ్రామ పంచాయతీల అధికారి కె.అనురాధ అన్నారు. మండల కేంద్రమైన ముసునూరులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు అంశాలను పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

ఆగిరిపల్లి : చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ పట్ల పంచాయతీ కార్యదర్శులు అలసత్వం వహిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఎంపిడిఒ బి.భార్గవి హెచ్చరించారు. మండల పరిధిలోని పోతవరప్పాడులో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తల సేకరణ గురించి క్లాప్ మిత్రాలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎ.ఉమాకాంత్ పాల్గొన్నారు.

మీడియా పేరుతో బెదిరింపులకు పాల్పడితే సహించం

పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మీడియా పేరుతో యూట్యూబ్ ఛానెల్స్, పిడిఎఫ్ పత్రికల్లో తప్పుడు కథనాలు రాసి సోషల్ మీడియా వేదికగా బెదిరింపులకు పాల్పడితే సహించేది లేదని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు హెచ్చరించారు. మండలంలోని బర్రింకలపాడు క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంతమంది మీడియా ముసుగులో యూట్యూబ్ ఛానెల్స్, పిడిఎఫ్ పత్రికల్లో అసత్య కథనాలు రాస్తూ సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, అలాంటివారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

పలుచోట్ల 'సుపరిపాలనలో తొలి అడుగు'

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఉంగుటూరులో...

సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా నూజివీడు పట్టణంలో గురువారం సాయంత్రం 19, 20, 26, 28 వార్డుల్లో వివిధ శాఖల అధికారులు, పార్టీ శ్రేణులతో కలిసి మంత్రి పార్థసారధి ఇంటింటికి వెళ్లి, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు కొన్ని సమస్యలను చెప్పగా వెనువెంటనే స్పందించి పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దెందులూరు : కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత ప్రజలకు మెరుగైన సుపరిపాలన అందిస్తున్నామని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పెదవేగి మండలం కె.కన్నాపురం, తాళ్ల గోకవరం గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దెందులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ గారపాటి రామసీత, టిడిపి పెదవేగి మండలాధ్యక్షులు ఈడుపుగంటి అనిల్, సీనియర్ నాయకులు తాతా సత్యనారాయణ, ఉప్పలపాటి రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి :సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని తోటపల్లిలో గురువారం ఆ గ్రామ మాజీ సర్పంచి టిడిపి నూజివీడు నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు ఆరేపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గడపగడపకు తిరిగారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో అమలు చేసిన పథకాల గురించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మండలం కాగుపాడులో టిడిపి పార్టీ నాయకులు గురువారం గడపగడపకు పర్యటించారు. సూపర్ సిక్స్ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామ మాజీ సర్పంచి కడియాల రవిశంకర్, గ్రామ సర్పంచి పొట్ల ఏడుకొండలు, పార్టీ గ్రామ అధ్యక్షులు అద్దంకి వంశీ, ఎస్‌సి సెల్ అధ్యక్షుడు దాసిరాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జి రమేష్, బూత్ ఇన్‌ఛార్జి బన్నీ, కో-కన్వీనర్ కమిట్ నాగరాజు, యూనిట్ ఇన్‌ఛార్జి అనిల్ కుమార్, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముసునూరు :సిఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తూ సుపరిపాలన అందిస్తున్నారని తెలుగు యువత కార్యదర్శి కొండేటి బాబి అన్నారు. మండలంలోని ముసునూరు గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికి వెళ్లి అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తోట శ్రీనివాసరావు, నక్క యోహాన్, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ :ఏలూరు నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిచేలా అధికారులు కృషి చేయాలని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి పిలుపునిచ్చారు. స్థానిక ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో గురువారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా స్వర్ణాంధ్ర-2047, పి4, తదితర కార్యక్రమాలపై అధికారులతో ఎంఎల్‌ఎ సమీక్షించారు. నియోజకవర్గంలో ప్రతి ఏటా 15 శాతం వృద్ధిరేటుతో కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామన్నారు.

1వ డివిజన్‌లో సమస్యలు పరిష్కరించండి
'సుపరిపాలన తొలిఅడుగు'లో ఎంఎల్‌ఎను కోరిన ప్రజలు

ఏలూరు సిటీ :డ్రెయిన్, అంతర్గత రోడ్లు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటిని ఏలూరు ఒకటో డివిజన్ వాసులు కోరారు. అలాగే అర్హులందరికీ పింఛన్లు, తల్లికి వందనం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ఒకటో డివిజన్‌లో ఎంఎల్ఎతో పాటు మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు వారి సమస్యలను ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన శాశ్వత పరిష్కార చర్యలు చేపడతానంటూ వారందరికీ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మేయర్ నూర్జహాన్, ఏలూరు ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దోమలను నివారించటంతో పాటు, సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి జె.జగన్మోహనరావు అన్నారు. జాతీయ డెంగీ మాసోత్సవాల్లో భాగంగా ఆగిరిపల్లి పురవీధుల్లో డెంగీ వ్యాధి నివారణకు చేపట్టాల్సిన చర్యలు, ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాల గురించి ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి సిహెచ్.లక్ష్మీ విక్టర్‌బాబు, నూజివీడు సబ్ యూనిట్ అధికారి యలమంద, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ప్రకటన నమ్మి రూ.2.56 లక్షలు పోగొట్టుకున్న మహిళ

తిరిగి రప్పించిన పోలీసులు

ఏలూరు స్పోర్ట్స్ : సైబర్ నేరగాళ్ల మోసంలో రూ.2.56 లక్షలు పోగొట్టుకున్న మహిళకు ఆ నగదును పోలీసులు తిరిగి అందించారు. రెండో పట్టణ సిఐ అశోక్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉండే సమీరా స్థానిక సచివాలయంలో సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. నగదును పెట్టుబడిగా పెడితే అధిక వడ్డీలు పొందవచ్చనే ప్రకటనలను ఆమె వాట్సాప్‌లో, ఫేస్‌బుక్‌లో ఇన్‌స్టాగ్రామ్‌లో చూసి తన ఖాతాలో ఉన్న రూ.2.56 లక్షలను ఆ ఫేక్ ఐడీల్లో ఇన్వెస్ట్ చేసింది. ఎంతకి సొమ్ము తిరిగి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. రెండో పట్టణ పోలీసులు, సైబర్ పోలీసులు సంయుక్తంగా ఈ కేసును ఛాలెంజిగ్‌గా తీసుకుని పోగొట్టుకున్న సొమ్మును తిరిగి సమీరా ఖాతాకు రప్పించారు. చెక్కును ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ చేతులమీదుగా సమీరాకు అందించారు.

పరిహారం కోరుతూ వినతి

ప్రజాశక్తి - కుక్కునూరు

పోలవరం ప్రాజెక్టు కారణంగా 41.5 కాంటూరు లెవెల్‌లో ముంపునకు గురైన గ్రామాల నిర్వాసితులకు నష పరిహారం చెల్లించినప్పటికీ, నాలుగు గ్రామాల నిర్వాసితులు అనివార్య కారణాల వల్ల ఈ పరిహారం పొందలేకపోయారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ టిడిపి మండలాధ్యక్షులు ములిశెట్టి నాగేశ్వరరావు నేతృత్వంలో పార్టీ నాయకులు ధవళేశ్వరంలో ఆర్అండ్ఆర్ కలెక్టర్ అభిలాష్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సత్యనారాయణ, గుర్రం ఉదయ్ పాల్గొన్నారు.

దేవదాయ ధర్మదాయ శాఖ

భూములు కౌలు టెండర్ - కం - బహిరంగ వేలం ప్రకటన

పశ్చిమగోదావరి జిల్లా, ఉండి మండలం, యండగండి గ్రామములో వేంచేసియున్న శ్రీ విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానమునకు హక్కుభుక్తములో ఉండి యున్న ఈ దిగువ గ్రామం తాలూకు దిగువ ఉదహరించిన భూమిని 2025-26 సం॥రం నుండి 2027-28 సం॥రం వరకు అనగా 3 సంవత్సరములకు కౌలు హక్కుకు ది. 15-07-2025వ తేదీ మంగళవారం ఉదయం 11.00లకు యండగండి గ్రామములో దేవాలయ ఆవరణములో దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షమున సదరు కార్యనిర్వహణాధికారి వారిచే టెండర్-కం-బహిరంగ వేలం పాటలు నిర్వహించబడును. కావున ఆసక్తి గలవారు పాటలో పాల్గొనవలసినదిగా కోరడమైనది.

వ.నెం.	భూమియున్న గ్రామం పేరు	రీ.సర్వే నెం.	పరిమితి య.సెంట్లు	చెల్లించవలసిన ధరావతు
1	యండగండి	253 250/1	5-09 0-04	5000/-
	మొత్తం భూమి		5-13	

ముఖ్య షరతులు:
1. ఈ వేలం పాట హిందూ దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల వారి ఉత్తర్వులకు లోబడి జరుగును. 2. వేలం పాటలో పాల్గొనదలచినవారు ప్రతి వారు ప్రథమ ధరావత్తు రూ. 5000/-లు చెల్లించి పాటలో పాల్గొనవలెను. 3. ప్రతి పాటదారుడు తనకు గల స్థిరాస్తి వివరములు తెలుపుచూ దస్తావేజు పట్టాదారు పాస్ పుస్తకము మరియు సాల్వెన్సీ సర్టిఫికెట్ తీసుకుని వచ్చి పాటకు ముందు అధికారులకు ఇవ్వవలెను. లేని యెడల పాటలో పాల్గొనుటకు అర్హులు కారు. 4. హెచ్చు పాటదారుడు పాట సొమ్ములో అనగా ఒక సంవత్సరము సొమ్మును అడ్వాన్సుగా చెల్లించే నిర్ణయం. 5. దేవస్థానమునకు ఏవిధమైన బకాయిలు ఉన్న వారు గాని, లావాదేవీలు గాని ఉన్న వారు పాటలో పాల్గొనరాదు. 6. దేవదాయ ధర్మదాయ శాఖ హిందూ సంస్థ అయినందున హిందువులు మాత్రమే పాటలో పాల్గొనుటకు అర్హులు. 7. ఇతర వివరములు మరియు నియమ నిబంధనలు కార్యాలయము పని చేయు వేళలలో వారిని సంప్రదించి తెలుసుకోగలరు.

గ్రామం: యండగండి
తేది: 03-07-2025
ఇట్లు: కొమ్మిరెడ్డి సూర్యనారాయణ
కార్యనిర్వహణాధికారి

CHANGE OF NAME

I, **BARRE DURGA** W/o. Barre Yesu D.No.1-171/B, Nagidipalem Village, Losari Gutlapadu Post, Bhimavaram Mandal, W.G.Dt. I have changed my name from **BARRE LAKSHMI** (Old name) to **BARRE DURGA** (New name) hence forth I am being called **BARRE DURGA** W/o. Barre Yesu for all purposes.

In The Court Of The VII Addl District Judge Com Family Court Eluru, W.G.Dt.
F.C.O.P.No. 42/2025

Between:
గట్టా లక్ష్మీ ...పిటీషనర్
మరియు
గట్టా ఉదయ్‌కుమార్ ...రెస్పాండెంట్

పై నెంబరు గ్రంథంలో గట్టా ఉదయ్‌కుమార్ S/o. సత్యనారాయణ R/o. H.No: 16A-20-67 M.R.C. కాలనీ, ఏలూరు అను వారికి నోటీసులు అమలు కొరకు పై కోర్టు వారి ఎదుట **ది. 16-07-2025 వ తేది ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయంగా గాని, వకీలు గారి ద్వారా గాని హాజరు అయి తమ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల దావా సంగతులు తమ పరోక్షమున తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కొల్లు శ్రీనివాసరావు
సంతోషిమాత
ఏలూరు అడ్వకేట్స్
తేది:03-07-2025 ఏలూరు

మహారాజశ్రీ 8వ అడిషనల్ జిల్లా జడ్జి ప॥గో॥జిల్లా, ఏలూరు
ఒ.ఎస్.నెం. 47/2022

బిట్వీన్ :
దొడ్డా నాగ వెంకట రాధాకృష్ణ ...వాది
మరియు
పెద్దిరెడ్డి వేణు గోపాల కృష్ణారావు వగైరాలు ...ప్రతివాది

వాది తరపు దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల దావాలో 4వ ప్రతివాది అయిన పొన్నూరి శ్రావణి, W/o రామకృష్ణారావు, ద్వారకాతిరుమల, ద్వారకాతిరుమల మండలం, ఏలూరు జిల్లా వారికి పై కోర్టులో **ది. 23-07-2025 తేదిన ఉదయం గం. 10:30 ని॥లకు** వాయిదా అయి ఉన్నది. కావున స్వయంగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా కాని హాజరయి తమ ఆక్షేపణలు తెలియ పర్చుకొనవచ్చును. లేని ఎడల సదరు దావా తమ పరోక్షమున విచారణ చేయుదురని ఇందుమూలంగా తెలియచేయడమైనది.

అవుల జగన్మోహనరావు
పుప్పాల రామకృష్ణ
ఏలూరు అడ్వకేట్లు, ఏలూరు
ది. 03-07-2025 ఏలూరు జిల్లా

ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No. 9/2024 in O.S.No. 200/2016

బిట్వీన్ :
నల్లగోపు దైవ వరప్రసాదరావు ...పిటీషనరు/వాది/Dhr
మరియు
కోటిచుక్కల మల్లేశ్వరరావు ...రెస్పాండెంట్/ప్రతివాది/Jdr

రెస్పాండెంట్/ప్రతివాది/Jdr:
కోటిచుక్కల మల్లేశ్వరరావు, తండ్రి: శ్రీరాములు, పురుషుడు, వయస్సు 47 సం॥లు, డోర్ నెం: 14-29-1 28 వ వార్డు, మాలకొండ చెర్వు దగ్గర, H.P.GAS రోడ్డు, తాడేపల్లిగూడెం-1, పిన్-534101, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

పై నెంబరు గ్రంథములో శ్రీ కోర్టు ద్వారా రెస్పాండెంట్/ప్రతివాది/Jdr కి పలుమార్లు నోటీసులు పంపించినప్పటికి రెస్పాండెంట్/ప్రతివాది/Jdr తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్ట్ వారు SUBSTITUTE ఉత్తర్వులు ప్రకారం **ది. 09-07-2025వ సం॥రం తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్ట్ వారి యెదుట రెస్పాండెంట్/ప్రతివాది/Jdr స్వయంగా గాని, లాయరు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు ఏమైన ఉన్నచో తెలుపవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడును. అని యిందుమూలంగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి అనుమతితో)
దూలం వెంకట విజయకుమార్
తాడేపల్లిగూడెం పిటీషనర్/వాది/Dhr అడ్వకేటు,
తేది. 02-07-2025 తాడేపల్లిగూడెం
సెల్: 98485 77222, 95459 34567

CHANGE OF NAME

I, **KADALI SATYA VARAPU LAKSHMI SRINIVASU** S/o. Kadali Sathya Narayana, D.No. 2-13, Peda Lanka, Peda Sarava Village, Narasapuram Mandal, W.G.Dt. I have changed my name from **KADALI SATAVARAPU LAKSHMI SRINIVASU** (Old name) to **KADALI SATYA VARAPU LAKSHMI SRINIVASU** (New name) hence forth I am being called **KADALI SATYA VARAPU LAKSHMI SRINIVASU** S/o. Kadali Sathya Narayana for all purposes.

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పాలకోడేరు మండలం, పెన్నాడ గ్రామం, రాజులవీధి, డోర్ నెం: 4-7/1 కు చెందిన గొట్టుముక్కల పార్వతి, W/o. గొట్టుముక్కల వెంకట సుబ్బరాజు అను నేను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెం: **W2688278** ది. 01-06-2025 తేదీన నా పాస్‌పోర్టును కవరులో పెట్టుకొని మా ఇంటి వద్ద నుండి విస్సాకోడేరు సెంటర్‌కు జిరాక్స్ తీసుకొనుటకు వెళ్ళుచుండగా మార్గమధ్యలో సదరు పాస్‌పోర్టు గల కవరు జారి పడిపోయినది. ఎంత వెతికిన దొరకలేదు. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

గొట్టుముక్కల పార్వతి
W/o. వెంకట సుబ్బరాజు
డోర్ నెం: 4-7/1,
పెన్నాడ గ్రామం, రాజులవీధి,
పాలకోడేరు మండలం, ప॥గో॥జిల్లా
Mobile: 90007 97641

In The Court Of The Hon'ble III rd Addl Civil Judge (Junior Division) Mobaile Court W.G.Dt, Eluru
O.S.No. 413/2023

Between:
Kakarla Nirmala Devi ...Plaintiff
Vs
Kakarla Naga Bhushana Chowda, Rani & others ...Defendants
D3: Smt. Parvathaneni Jaya, W/o. Madhusudhana Rao, R/o. No. 24c-11-10, Manchinellathota, Pathebad, Eluru, Eluru Dist., Eluru JCJC.

పై నెంబరు గ్రంథంలో దావా షెడ్యూలు ఆస్తిలో వాదికి రావలసిన వాటాను పార్టిషను చేసి వాదికి రావలసిన వాటాను ఇప్పించుమని కోరుచూ దాఖలు చేసిన పై నెంబర్ దావాలోను మరియు I.A.No. 192/2023 లో కూడా 3వ ప్రతివాదికి ఏమైన అభ్యంతరములు ఉన్న యెడల **ది. 07-07-2025 వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు గాని, ప్లీడర్ గారి ద్వారా గాని హాజరయి మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల పరోక్షముగా Order pass చేయబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
Ch.S.R. శ్రీనివాస్
ఏలూరు అడ్వకేట్
తేది:01-07-2025 తాడేపల్లిగూడెం

In The Court Of The Junior Civil Judge (Junior Division) at Bhimadole, Eluru Dt
O.S.No. 99/2024

Between:
శనపతి పైడమ్మ ...వాది
మరియు
యనమండ్ర రామలక్ష్మి వగైరాలు ...ప్రతివాదులు

To:
1. యనమండ్ర రామలక్ష్మి, W/o. (లేటు) దుర్గాప్రసాద్, శాంతి కాన్వెంట్ వద్ద, భీమడోలు, భీమడోలు మండలం. **(D1)**
2. యనమండ్ర విశ్వతేజ, S/o. (లేటు) దుర్గాప్రసాద్, శాంతి కాన్వెంట్ వద్ద, భీమడోలు, భీమడోలు మండలం. **(D2)**
3. యనమండ్ర వైష్ణవి, D/o. (లేటు) దుర్గాప్రసాద్, శాంతి కాన్వెంట్ వద్ద, భీమడోలు, భీమడోలు మండలం. **(D3)**

పై నెంబరు దావాను వాది అయిన శనపతి పైడమ్మ గారు భీమడోలు కోర్టులో ప్రతివాదులపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావా గ్రంథములో 1వ, 2వ, 3వ ప్రతివాదులైన 1.యనమండ్ర రామలక్ష్మి, 2. యనమండ్ర విశ్వతేజ, 3. యనమండ్ర వైష్ణవి భీమడోలు వార్కి నోటీసు నిమిత్తం **ది. 30-07-2025 తేదీకి** వాయిదా అయివున్నది. కావున 3గురు ప్రతివాదులు కోర్టు వారు ఎదుట **ది. 30-07-2025 తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారిని ఎక్స్‌పార్టీ చేసి దావా తీర్మాణము చేయబడును.

(శ్రీ కోర్టు వారు ఆర్డరు ప్రకారం)
శ్రీ ఆల్తి శ్రీనివాస్
శ్రీమతి సుధారాణి
ఎస్. గోపాలకృష్ణ
భీమడోలు వాది తరుపు న్యాయవాదులు,
ది.01-07-2025 భీమడోలు
సెల్ నెం: 94909 98949